# ప్రజాశక్తి

గురువారం 27 జులై 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

# సేద్యం మరింత జాప్యం!

- కొనసాగుతున్న భారీ వర్షాలు
- పొలాల్లో కదలని వర్షం నీరు
- సిద్ధం చేసిన సాగు భూమి ఛిన్నాభిన్నం

పెదకూరపాడులోని పత్తి పొలంలో నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల మూడ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల గుంటూరు, పల్నాడు జిల్లాలోని వివిధ మండలాల్లో ఖరీఫ్ సాగు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే చాలీచాలని వర్షాలతో ఖరీఫ్ సాగు జాప్యమైంది. సాధారణ వర్షాల కోసం పొలాల్లో దుక్కి దున్ని సిద్ధం చేసుకున్న భూమిలో తాజా కురుస్తున్న భారీ వర్షాలతో వర్షం నీరు చేరడంతో మొత్తం బురదమయంగా మారింది. ఈ బురద ఎండిన తరువాత తిరిగి నేలను పదును చేయాలంటే కనీసం 10 రోజులు పడుతుందని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు.

రెండు జిల్లాల పరిధిలో వ్యవసాయ భూమి ఎక్కువగా నల్లరేగడి భూమి ఉండటం వల్ల వర్షాలతో పొలాల్లో నిలిచిన బయటకు పోయిన తరువాత కొంత ఎండిన తరువాత మట్టిని తిరిగేసి మళ్లీ సాళ్లు పోసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా మెట్ట పంటలకు మరో సారి భూమిని పదును చేసుకోవడం కోసం అదనపు ఖర్చు అవుతుంది. ఇప్పటికే విత్తనాలు నాటేందుకు భూమిని సిద్ధం చేయగా అధికవర్షాలు కురిసిన ప్రాంతాల్లో కాల్వలు సరిగా లేక పొలాల్లోనీరు నిలిచి ఉంది. దీంతో రైతులకు ఆదిలోనే కష్టాలు ఎదురవుతున్నాయి.

ఇప్పటికే వరి, పత్తి సాగు చేసిన రైతులకు ముంపు సమస్య పొంచి ఉంది. వారం క్రితం సాగు చేసిన వరి, పత్తి పంటలకు వర్షాలు తీవ్ర నష్టం కల్గించాయి. ప్రధానంగా వెదపద్ధతిలో సాగుచేసిన వరికి, ఇటీవల పత్తి విత్తనాలు నాటిన పొలాల్లో కూడా నీరు చేరడం వల్ల తొలకరి దశలోనే పైర్లకు నష్టం వాటిల్లుతోంది.

| మండలం | వర్షపాతం |
|---|---|
| **గుంటూరు జిల్లా:** | |
| కొల్లిపర | 80.2 మిల్లీ మీటర్లు |
| తాడికొండ | 60.4 |
| తుళ్లూరు | 51.8 |
| దుగ్గిరాల | 50.8 |
| తాడేపల్లి | 49.6 |
| గుంటూరు(ప) | 48.2 |
| గుంటూరు(తూ) | 47.2 |
| మంగళగిరి | 47.2 |
| చేబ్రోలు | 45.4 |
| పెదకాకాని | 42.6 |
| మేడికొండూరు | 37.6 |
| వట్టిచెరుకూరు | 35.8 |
| పొన్నూరు | 32.8 |
| ప్రత్తిపాడు | 29.8 |
| ఫిరంగిపురం | 29.2 |
| తెనాలి | 25.2 |
| పెదనందిపాడు | 22.6 |
| కాకుమాను | 20.8 |
| **పల్నాడు జిల్లా :** | |
| అమరావతి | 56.2 |
| బెల్లంకొండ | 45.2 |
| పెదకూరపాడు | 34.2 |
| వెల్దుర్తి | 25.2 |
| అచ్చంపేట | 24.6 |
| గురజాల | 23.4 |
| దుర్గి | 23.4 |
| సత్తెనపల్లి | 23.2 |
| క్రోసూరు | 22.8 |
| మాచర్ల | 20.4 |

గుంటూరు జిల్లాలోని అన్ని మండలాల్లో ఇప్పటికే అవసరానికి ▶ 2లో

## గుంటూరు ఛానల్‌లోకి మురుగు నీరు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని చినకాకాని పొలాల్లో ఉన్న మురుగునీటి కాల్వ కట్ట అందులోని మురుగు నీరంతా గుంటూరు ఛానల్లో కలుస్తోంది. ఎడతెరిపి లేని వాన కారణంగా ఎన్నారై వద్ద నుంచి వెళ్లే మురుగు కాల్వ కట్టకు బుధవారం గండి పడింది. ఎన్‌ఆర్ఐ నుండి వచ్చే మురుగంతా ఈ కాల్వ నుండే వెళ్తుంది. కాల్వ కట్ట దెబ్బతిందని స్థానికులు గతంలోనే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, అందుకే ఈ పరిస్థితి వచ్చిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా గుంటూరు ఛానల్ నీటినే గుంటూరు నగరంతోపాటు పలు గ్రామాలకూ తాగునీటి అవసరాల కోసం ఉపయోగిస్తారు. ప్రస్తుతం ఈ ఛానల్‌లో మురుగునీరు కలవడంపై ప్రజల్లో ఆందోళన నెలకొంది.

సమీక్షలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు, వేదికపై ఎమ్మెల్యేలు, కలెక్టర్

## సాకులతో తప్పించుకోవద్దు..

- అధికారులకు ఇన్‌ఛార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశం
- మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల సమావేశం
- నిధులివ్వాలని కోరిన ఎమ్మెల్యేలు - క్షేత్రస్థాయి సమీక్షలకు శ్రీకారం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల వేగం పెంచేందుకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రుల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో సమీక్షలు చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం సమీక్షలకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గాల వారీగా సంబంధిత ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు, నియోజకవర్గానికి ▶ 2లో

## కలవరపెడుతున్న కళ్లకలక

### వందల సంఖ్యలో బాధితులు - జిల్లా ఆస్పత్రికి రోజుకు 50 మంది

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలోని పలు మండలాల్లో కళ్లకలక విజృంభిస్తోంది. ప్రతిరోజూ వందలాదిమంది దీని బారిన పడుతున్నారని సమాచారం. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, జన సమూహం ఉండే ప్రాంతాల్లో ఎక్కువగా నివసించే ప్రజలు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. పట్టణ సమీపంలోని లింగంగుంట్ల పరిధిలో గల డాక్టర్ వైఎస్ఆర్ జిల్లా ఆస్పత్రికి రోజుకు 50 మందికిపైగా కళ్లకలక బాధితులు వస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ బివి.రంగారావు తెలిపారు. కళ్ల కలక వల్ల ప్రమాదం లేకపోయినా అప్రమత్తంగా ఉండడం అవసరమని చెప్పారు. సొంత వైద్యం కాకుండా కంటి వైద్యనిపుణుల సలహా మేరకు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని, ఎం.వి కంటి హాస్పిటల్ అధినేత డాక్టర్ ముద్దం వివేకానందరెడ్డి చెబుతున్నారు.

**వేగంగా వ్యాప్తి...**

ఇది ఒకరి నుండి ఒకరికి త్వరగా వ్యాపిస్తుంది. బాధితులు తమ కుటుంబ సభ్యులతో కలవకుండా కనీసం ఒక వారం రోజులపాటు ప్రత్యేకంగా ఒక గదిలో ఉండాలి. కళ్ల కలక సోకిన వ్యక్తి తాకిన వస్తువులను ఇతరులు తాగకుండా జాగ్రత్తగా తీసుకోవడం వలన వ్యాధిని ఉధృతి కొంతవరకు నివారించొచ్చు. కళ్ల ▶ 2లో

ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ తదితరులు

## డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహించిన డిగ్రీ 6వ సెమిస్టర్ ఇంటర్‌షిప్ పరీక్ష ఫలితాలను విసి పి.రాజశేఖర్ బుధవారం విడుదల చేశారు. పరీక్షలకు మొత్తం 24,766 మంది హాజరుకాక 24,657 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్ నుండి పొందొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏసీ ఆర్.ప్రకాష్, రెక్టార్ పి.వర ప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ పాల్గొన్నారు.

**పని చేస్తుండగా ప్రమాదం..** 2 లో

**భవననిర్మాణ కార్మికుడు మృతి**

# పేదలకు పంచడానికి వీలుగా వేల ఎకరాలు

- జాబితాను ప్రభుత్వం ముందు ఉంచడానికి నేడు భూ సదస్సు
- దేవాదాయ భూములు సాగుదార్లుగా చిన్న, సన్నకారు రైతులను నమోదు చేయాలి
- పలు గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ప్రచారం

గురజాల మండలం మాడుగుల గ్రామంలో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

దేవాలయ భూముల కౌలుదారులుగా చిన్న, సన్నకారు రైతుల పేర్లు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు గురజాల ఎంపిడిఒ కార్యాలయం వద్ద జరిగే భూ సదస్సు జయప్రదం చేయాలని కోరుతూ గురజాల మండలంలో బుధవారం ఆటో ప్రచారం నిర్వహించారు. జంగమేశ్వరపురం, చర్లగుడిపాడు, గురజాల, గంగవరం, పులిపాడు, దైద, సమాధానంపేట, గోగులపాడు, మాడుగుల, అంజనీపురం తదితర గ్రామాల్లో ప్రచారం సాగింది. ఈ సందర్భంగా లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు భూములు పంచుతామని ఒకవైపు చెబుతున్నా మరోవైపు పేద, చిన్న సన్నకారు రైతుల ఆధీనంలోని దేవాలయ భూములను వారి పేరుతో నమోదు చేయకుండా పెద్ద రైతుల పేరుతో నమోదు చేస్తోందని అన్నారు. తద్వారా చిన్న రైతులకు రాయితీలు, పథకాలు అందకుండా చేస్తోందని విమర్శించారు. గంగవరం, మాడుగుల, దైద తదితర అనేక గ్రామాల్లో దేవాదాయ భూములను సాగు చేసుకుంటూ కౌలు చెల్లిస్తున్న పేద రైతుల పేర్లను దేవాదాయ శాఖ రికార్డుల్లో నమోదు కావడం లేదని, వారికి కౌలు రైతుగా పంట రుణాలు ఇవ్వడం లేదని అన్నారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల ప్రకారం భూమి లేని ప్రతి పేద కుటుంబానికి రెండెకరాల సాగుభూమి పంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు పంచడానికి వీలున్న భూముల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ముందు ఉంచడానికే సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సు అనంతరం ఆర్‌డిఒకు భూముల జాబితాను ఇస్తామని చెప్పారు. అసైన్మెంట్ భూముల విషయంలో ఉన్న పిఓటి చట్టం 9/77ను సవరించడం సరికాదన్నారు. ఇప్పటికే అసైన్మెంట్ భూముల్లో సగం భూములు అన్యాక్రాంతం మయ్యాయని, అన్యాక్రాంతమైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని, అనర్హులకు భూముల రిజిస్ట్రేషన్ చేయొద్దని కోరారు. ప్రచారంలో చర్లగుడిపాడు భూ పోరాట కమిటీ సభ్యులు పి.ఆదాం, కె.అక్కులు, పి.రమేష్, బి.సువర్ణబాబు, వి.ఏసుబాబు, కె.ఎలమంద పాల్గొన్నారు.

## సాకులతో తప్పించుకోవద్దు..

(మొదటి పేజీ తరువాయి)

చెందిన అధికారులతో సమీక్షించాలనే ఆదేశాల మేరకు తొలి విడత మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గాలపై కలెక్టరేట్‌లోని డిఆర్‌సి హాలులో బుధవారం సమీక్షించారు. సమావేశానికి జిల్లా స్థాయి అధికారులతో పాటు మండల స్థాయిలో అధికారులూ హాజరయ్యారు. మున్సిపల్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, రెవెన్యూ, విద్యుత్, దేవాదాయ తదితర శాఖల వారీగా అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు.

మంత్రి మాట్లాడుతూ పనులు నిర్దేశిత సమయంలో పూర్తయ్యేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులంతా క్షేత్రస్థాయి అధికారులను నిత్యం పర్యవేక్షించాలని చెప్పారు. అధికారులు చేయడం ఒకెత్తయితే సిబ్బందితో పని చేయించడం వారి పనితనానికి గీటురాయి అని అన్నారు. పని పూర్తికావడానికి ఉన్న అడ్డంకులను తొలగించుకోవాలేగాని తప్పించుకోవడానికి ప్రయత్నించొద్దన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన అంశాలను పరిగణలోకి పనులు వేగిరపర్చాలన్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో అదనపు సిబ్బందిని నియమించడానికి అనుమతి, తాడేపల్లి వద్ద బకింహామ్ కెనాల్‌కు పరిపాలన అనుమతులు, పెదవడ్లపూడి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు పెండింగ్‌లో వున్న నిధులు మంజూరు అంశాలను ప్రస్తావించారు. మంగళగిరి కొప్పురావు కాలనీ, ఆంజనేయ కాలనీ, లక్ష్మీనరసింహారావు కాలనీల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేశారని, వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవడానికి ఆన్‌లైన్ ప్రాసెస్ కావడం లేదని, సాంకేతిక సమస్యను పరిష్కరించాలని కోరారు. తాడేపల్లిలో శ్మశాన వాటికకు స్థలం మంజూరు చేయాలని, సర్వే పోస్టులు రెండు అదనంగా కేటాయించాలని కోరారు. దుగ్గిరాల మండలంలో 47 అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ. 50 కోట్ల స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కోరారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ పని చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రావడంలేదన్నారు. సచివాలయం పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు బిల్లులు సకాలంలో అప్లోడ్ చేయడం లేదన్నారు. ఆర్ అండ్ బి రోడ్ల నిర్మాణానికి సంబంధించి బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించాలని కోరారు. చేబ్రోలు మండలంలోని శేకూరుపాలెంలోని శ్మశాన వాటిక విస్తరణకు, పొన్నూరులో ఆటో నగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తహశీల్దార్ కార్యాలయం మార్పుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ కె.చంద్రశేఖరరావు, జెడ్‌పి సిఇఒ మోహన్‌రావు, డిఆర్‌డిఎ, డ్వామా, గృహ నిర్మాణ శాఖ పీడీలు హరిహరనాథ్, యుగంధర్ కుమార్, వేణుగోపాల్, డిపిఒ కేశవరెడ్డి, సిపిఒ శేషశ్రీ పాల్గొన్నారు.

సాయం అందిస్తున్న నాయకులు

## వాలంటీర్‌కు రూ.25వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని 14వ వార్డు సచివాలయం సీతానగరంలో వాలంటీర్‌గా పని చేస్తున్న పఠాన్ షాహిదాఖతుమ్ కేన్సర్ వ్యాధితో బాధపడుతోంది. చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆర్థిక పరిస్థితి తెలుసుకుని స్థానిక వైసిపి నాయకుల ద్వారా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ ఇ.డేవిడ్‌రాజు, ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.దుర్గారావు, కన్వీనర్ బాలస్వామి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కలవరపెడుతున్న కళ్లకలక

కలక సోకిన వారు తరచూ కళ్లను తాకాల్సి వస్తుంది. అలా తాకిన ప్రతిసారీ చేతులు చేతులు శుభ్రం చేసుకోవాలి.

**లక్షణాలు...**

కంటి నుండి విపరీతంగా నీరు కారడం, కళ్లు ఎర్రబడటం, రెప్పలు అంటుకుపోవడం, విపరీతంగా పుసులు రావటం, మంట పుట్టడం, కంటిలో ఇసుక పడినట్లు గుచ్చుకోవటం తదితర లక్షణాలుంటే నేత్ర వైద్యులు సంప్రదించాలి. గతంలో కరోనా బారిన పడిన వారిలో ఈ వ్యాధి సులభంగా వ్యాపించే అవకాశం ఉంది.

కంటి గుడ్డి చుట్టూ తెల్లని పొర రెప్పల వెనక ఉండే పొరను కంజెక్టైవా అంటారు. దుమ్ము, ధూళి, వేడి నీరు, అధిక గాలి కంటి పొరలను తాకితే శరీరంలో సున్నిత భాగమైన కన్ను తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంది. సున్నితమైన అవయవాలు కావడంతో వేగంగా ఇన్ఫెక్షన్ బారిన పడే అవకాశం ఉంది. కళ్లు ఎర్రగా మారుతాయి. ఒక కంటికి కానీ రెండింటికి రెండు కళ్లకి వచ్చే అవకాశం ఉంది. ఇన్ఫెక్షన్ కారణంగా కణజాలంలో చేరిన బ్యాక్టీరియా వైరస్ ఇతరులకు వ్యాపించే ప్రమాదం ఉంది.

**జాగ్రత్తలు...**

కళ్ల కలక బారిన పడినవారు కంటిని తాకకుండా ఉండేందుకు ప్రయత్నం చేయాలి. మెత్తటి గుడ్డతో కంటి భాగాన్ని ఒత్తిడి తగలకుండా తుడుచుకోవాలి. తరచూ శుభ్రమైన నీటితో కడుక్కోవాలి. ఇంటి నుండి బయటకు రాకుండా గదిలోనే ఉండాలి. కుటుంబ సభ్యులకు సైతం దూరంగా ఉండాలి. వారం రోజుల్లోపు తగ్గకపోతే తప్పనిసరిగా నేత్ర వైద్య నిపుణులను సంప్రదించాలి. వైద్యుల సూచన మేరకు చికిత్స పొందాలి. నవజాత శిశువుకు కండ్ల కలక సోకితే ప్రమాదకరం. కండ్ల కలక బాధితులు చిన్నారులకు దూరంగా ఉండాలి. పాఠశాలలు, ప్రజలు ఎక్కువగా గుమ్మి కూడిన ప్రదేశాల్లో ఈ వ్యాధి వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది.

**ఆందోళన వద్దు**

వర్షాకాలంలో ఎక్కువగా ఈ అంటువ్యాధి కనిపిస్తుంది. క్రిముల కారణంగా ఇది వ్యాపిస్తుంది. కొన్ని రోజుల్లోనే తగ్గుముఖం పట్టినా జాగ్రత్తలు తప్పనిసరి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చిన్నారులకు సోకితే మాత్రం వెంటనే వైద్యులను సంప్రదించాలి. చుక్కల మందును ఎలాగంటే అలా వాడటం వలన ఇతర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. వైద్యుల సూచన మేరకే చుక్కల మందు వేయించుకోవాలి అని డాక్టర్ ముద్దం వివేకానందరెడ్డి వివరించారు.

## సేద్యం మరింత జాప్యం!

(మొదటి పేజీ తరువాయి)

మించి వర్షం కురిసింది. కొల్లిపరలో మండలంలో జులైనెలలో 168 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా ఈనెలలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 433 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. బుధవారం కూడా రెండు జిల్లాల పరిధిలోని పలు మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి.

అల్పపీడనం ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లాలో అన్ని మండలాల్లో భారీవర్షం నమోదైంది. కొల్లిపరలో అత్యధికంగా 80.2 మిల్లీ మీటర్లు నమోదైంది. పల్నాడు జిల్లాలో 28 మండలాలకు గాను 10 మండలాల్లోనే ఒక మోస్తరువర్షం కురిసింది. అమరావతి, పెదకూరపాడు, సత్తెనపల్లి, అచ్చంపేట, క్రోసూరు, మాచర్ల, బెల్లంకొండ, గురజాల, దుర్గి, వెల్దుర్తి మండలాల్లో 20 మిల్లీ మీటర్లు దాటి వర్షం కురిసింది. మిగతా 18 మండలాల్లో 20 మిల్లీమీటర్ల కన్నా తక్కువ వర్షం కురిసింది. పెదకూరపాడు నియోజకవర్గంలో గతరెండు రోజులుగా భారీ వర్షాలు కురవడం వల్ల అమరావతి వద్ద పెదమద్దూరు వాగు పొంగి ప్రవహించింది. దీంతో విజయవాడ- అమరావతి మధ్యరాకపోకలు నిలిచాయి.

నాన్సుడు వర్షాలతో గుంటూరు, పల్నాడు జిల్లాలోని రహదారులు దెబ్బతిన్నాయి. పలు కాలనీల్లో రహదారులు బురదమయంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు పంట పొలాలను తలపిస్తున్నాయి. గుంటూరులో బుధవారం వేకువజాము నుంచి సాయంత్రం వరకు కుండపోతగా వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో రోడ్లపై వర్షం నీరుపారింది. పలు కాలనీల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జులైలో గుంటూరు జిల్లాలో 164.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటివరకు 254.4 మిల్లీమీటర్లు నమోదైంది. పల్నాడు జిల్లాలో 131 మిల్లీ మీటర్లకు గాను 97.4 మిల్లీ మీటర్లు నమోదైంది.

## భవననిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు వికాస్ నగర్ మూడో లైన్‌లో కొత్తగా నిర్మాణంలో ఉన్న అపార్ట్మెంట్ నాలుగో ఫ్లోర్లో సెంట్రింగ్ పనులు చేస్తున్న భవననిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. పట్టాభిపురం పోలీసుల కథనం ప్రకారం తాడికొండ మండలం తాటి రెడ్డిపాలెంకు చెందిన కటారి అశోక్ అను వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడటం వలన అక్కడికక్కడే మతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పట్టాభిపురంపోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

వైసిపి విధానాలతో పేదలు అర్థాకలితో అలాంటిస్తున్నారని, వారి కడుపు నింపడానికి ఉచిత అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేశామని టిడిపి సీనియర్ నాయకులు కడియాల హాస్పిటల్ అధినేత డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని పల్నాడు రోడ్డులో పువ్వాడ హాస్పిటల్ పక్కన డాక్టర్ కడియాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ ను టిడిపి నియోజకవర్గ బాధ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించి మాట్లాడారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో పేదప్రజల సంపాదన కుటుంబ ఖర్చులకూడా సరిపోని పరిస్థితి నెలకొందన్నారు. నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటి మధ్యతరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు.

**అధిష్టానం ఆదేశిస్తే పోటీకి సిద్ధం**

డాక్టర్ కడియాల మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా తనకు అధిష్టానం అవకాశం కల్పిస్తే పోటీ చేస్తానని అధిష్టానం నిర్ణయమే తనకు శిరోధార్యం అంటూ వ్యాఖ్యానించారు. డబ్బు పట్ల వ్యామోహం లేదని కుటుంబ సభ్యులు కూడా వైద్య వత్తిలోనే స్థిరపడ్డారని ఇంకా మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో క్రియాశీలక రాజకీయాలలోని వద్దామని ఆలోచన వచ్చిందన్నారు. అసెంబ్లీ టిక్కెట్ తనకు ఇవ్వకపోయినా టిడిపి అభ్యర్థిగా ఎవరు ఉన్నా వారి గెలుపుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు : డిఎంహెచ్‌ఒ

**ప్రజాశక్తి - ఫిరంగిపురం:** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి శ్రావణ్‌బాబు తెలిపారు. బుధవారం ఫిరంగిపురంలో ఎంపిపి కార్యాలయంలో అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఎఎన్ఎంలు ఇంటింటికి తిరిగి జ్వరాల సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని తెలిపారు. పిహెచ్‌సి డిడిఒ ఫరీనా బేగం, ఎంఒ సిహెచ్ యూనిగ్రేస్, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

# నగరాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నగర అభివృద్ధికి బిల్డర్లు ముందుకు రావాలని, నిర్దేశిత పన్నులు సకాలంలో చెల్లించి సహకరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. బుధవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత బిల్డర్ల సమస్యలు, జిఎంసి తరపున అందించాల్సిన సహకారంపై అడిగి తెలుసుకొని మాట్లాడుతూ నగరాభివృద్ధిలో బిల్డర్లు భాగస్వాములు కావాలని కోరారు. భవన నిర్మాణ ప్లాన్ కోసం దరఖాస్తు చేసే సమయంలోనే నిబంధనల ప్రకారం పన్నులు చెల్లించడం, ప్లాన్ ప్రకారం నిర్మాణం చేపట్టడం చేయాలన్నారు. నగరంలో సర్వేయర్‌లు ప్రస్తుతం అందుబాటులో లేకపోవడం వలన సమస్యగా ఉన్నదని, త్వరలో సర్వేయర్‌లు నగరపాలక సంస్థకు వస్తారన్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ దరఖాస్తుకి ముందే రెవెన్యూ విభాగం నుండి సదరు భవనానికి సంబందించి ఖాళీస్థల పన్ను, ఇతర పన్నులపై ఎన్ఓసి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, అప్రూవ్డ్ డీవియేషన్‌కు 25 శాతం అధికంగా విధిస్తున్న ఆస్తి పన్నుపై పరిశీలన చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ఆక్యుపెన్సీ, మార్ట్‌గేజి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. భవనాలకు పోస్ట్ వెరిఫికేషన్ కూడా వేగంగా పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. ఇన్నర్‌రింగ్ రోడ్డులో డ్రైనేజి లెవల్స్‌ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఎస్ఈని ఆదేశించారు. గోరంట్ల తాగునీటి పథకానికి సమగ్రంగా నీరు అందేలా తక్కెళ్ళపాడు హెడ్ వాటర్‌వర్క్సులో మరో ఫిల్టరేషన్ ప్లాంట్ నిర్మాణంకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, క్రెడాయ్ ప్రతినిధులు శివారెడ్డి, రాము, నరేడ్కో క్యాపిటల్ జోన్ ప్రతినిధులు నాగ వంశీ, శ్రీనాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మణిపాల్ ఆసుపత్రికి గవర్నర్ రాక

**ప్రజాశక్తి-తాడేపల్లి** :రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ గురువారం 12.30 గంటలకు మణిపాల్ ఆసుపత్రికి రానున్నారని డైరెక్టర్ మణిపాల్ హాస్పిటల్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి తెలిపారు. ప్రపథమంగా మల్టీ స్పెషాలిటీ ఛానల్‌తో రోబోటిక్ సెంటర్‌ను ఆయన ప్రారంభిస్తారని చెప్పారు.

## జర్నలిస్టుల రాయితీ ని పునరుద్ధరించండి : గల్లా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రైళ్లలో ప్రయాణించే జర్నలిస్టులకు కోవిడ్-19 సమయంలో రద్దు చేసిన రాయితీని పునరుద్ధరించాలని గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ బుధవారం లోక్‌సభలో ప్రస్తావించారు. విధి నిర్వహణలో భాగంగా రైళ్లలో ప్రయాణించాల్సిన అవసరం ఉంటుందని వీరికి గతంలో ఉన్న రాయితీని తిరిగి కొనసాగించాలని ప్రధాని నరేంద్రమోడికి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులకు రాయితీలు లేకపోవడం వల్ల వారిపై అదనపు భారం పడుతోందని, అక్రిడేటెడ్ జర్నలిస్టులకు రాయితీలు పునరుద్ధరించాలని కోరారు.

## అధ్వాన రహదారులపై టిడిపి నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరుతూర్పు నియోజకవర్గంలో రహదారులు అధ్వానంగా ఉన్న అధికారులు పట్టించుకోకపోవడంపై టిడిపి నాయకులు స్థానిక నందివెలుగు రోడ్డు వద్ద బుధవారం సాయంత్రం నిరసన తెలిపాయి. టిడిపి నియోజకవర్గం ఇంచార్జ్ మహమ్మద్ నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో పాత గుంటూరు రైతు బజార్ వద్ద నిరసన తెలిపారు. నసీర్ గుంతల రోడ్డుపై మంచం వేసుకుని, గుంతలలో నిలిచిన నీటిలో మొక్కలు నాటుతూ తమ నిరసనవ్యక్తం చేశారు. ప్రధాన రహదారులు చెరువులుగా మారు తున్నా ప్రజా ప్రతినిధులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు.వైసిపి హయంలోరోడ్ల మరమ్మతు లపైతీవ్రనిర్లక్ష్యం కన్పిస్తుంద న్నారు.ఎమ్మెల్యే ముస్తాఫా ఉత్తర ప్రగల్భాలు తప్ప అభివృద్ధి పనులు ఏమీ చేయడం లేదన్నారు. పలువురు కార్పొరేటర్లు, టిడిపినాయకులు పాల్గొన్నారు.

## మిర్చి నిల్వలు

| | బ్యాగులు |
|---|---|
| మిర్చి దిగుమతి | : 30,687 |
| మిర్చి ఎగుమతి | : 30,922 |
| మిర్చి నిల్వ | : 9,880 |

## మిర్చి ధరలు

| | రూపాయలలో |
|---|---|
| 334 | 9,000 - 24,000 |
| నెం.5 | 14,000 - 20.200 |
| 273 | 17,000 - 21,000 |
| 341 | 11,500 - 20,500 |
| 4884 | 18,500 - 18,500 |
| సూపర్10 | 21,000 - 24,500 |
| | నాన్ ఎసి |
| తేజ | 9,500 - 24,500 |
| బడిగి | 9,000 - 25,000 |
| దేవనూరు డీలక్స్ | 20,000 - 20,800 |
| తాలుకాయలు | 5,000 -14,500 |
| | ఎసి |
| 334 | 16,500 - 22,200 |
| నెం.5 | 23,000 - 23,500 |
| 273 | 18,500 - 19,500 |
| 341 | 12,500 - 21,000 |
| తేజ | 14,000 - 23,500 |
| బడిగి | 15,000 - 25,500 |
| దేవనూరు డీలక్స్ | 15,000 - 19,000 |
| తాలుకాయలు | 5,000 -12,500 |

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొల్లా రాజమోహనరావు

# 1న ముఖ్యమంత్రి వద్దకు రైతుయాత్ర

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

50 వేల ఎకరాలకు సాగునీరు 50 గ్రామాలకు తాగు నీరు అందించే గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించే పనులకు నిధులు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ ఆగస్టు 1వ తేదీన శాంతియుతంగా పెదనందిపాడు నుండి రైతు యాత్ర ప్రారంభించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలుసుకొని వినతిపత్రం అందించేందుకు రైతు సంఘాలు నిర్ణయించినట్లు నల్లమడ రైతు సంఘ అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజ మోహన్ రావు బుధవారం పెదనందిపాడులో విలేకరుల సమావేశంలో ప్రకటించారు. విషయా న్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు 20 రోజులు శాంతియుతంగా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళడానికి నిరసన దీక్షలు చేసినా సమస్య పరిష్కరించకుండా పోలీసులు దాడికి పాల్పడ్డారన్నారు. తాము ప్రభుత్వాన్ని కోరరాని కోరికలు ఏమీ అడగలేదని ప్రస్తుతం వట్టిచెరుకూరు మండలం యామర్తి వరకు ఉన్న గుంటూరు ఛానల్ ను పర్చూరు వరకు పొడిగించేందుకు కేవలం రూ.300 కోట్లు మాత్రమే అవుతుందని దీనివల్ల 50 వేల ఎకరాలు సస్యశ్యామల మవుతాయని ఆ ప్రాంతంలో తాగునీటికి కరువు లేకుండా ఉంటుందని తెలిపారు. ప్రజల సంక్షేమం అంటూ వేలకోట్లు బటన్ నొక్కి విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి 50 వేల ఎకరాలు సస్యశ్యామల మవటమే కాకుండా పరిశుద్ధమైన త్రాగునీరు అందించే ఈ గుంటూరు ఛానల్ పొడిగింపు పనులకు కేవలం 300 కోట్లు మంజూరు చేయలేకపోవడం కారణమేంటని ప్రశ్నించారు. ఈ ప్రాంత రైతులు ప్రజల కష్టాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి నిధులు మంజూరు చేయించుకునేందుకు శాంతియుతంగా ఆగస్టు 1న తలపెట్టిన రైతు యాత్ర విజయవంతం చేసేందుకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. శాంతియుతంగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి అధికారులు కూడా సహకరించాలని రాజమోహనరావు విజ్ఞప్తి చేశారు. రైతు యాత్ర విజయవంతానికి గ్రామాల్లో నల్లమడ సంఘం ఆధ్వర్యంలో మహిళా రైతులు, రైతులు ప్రచారం చేస్తున్నారన్నారు. విలేకరుల సమావేశంలో నల్ల మడ రైతు సంఘం కార్యదర్శి వై అంకమ్మ చౌదరి, నర్రా బాలకృష్ణ, రావి శివరామకృష్ణయ్య, బండి నాగేశ్వరరావు, పోపూరి వెంకటప్పయ్య, లావు అంకమ్మచౌదరి, అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, కొల్లా నిర్మల రామన్, ఈదర భ్రమరాంబ, ప్రమీల, రమాదేవి, రత్నకుమారి, బాలసుందరి, పలు ప్రాంతాల నుండి వచ్చిన రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన పాఠశాల బస్సు

## తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల కేంద్రం దుగ్గిరాలలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన బస్సుకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఆ సమయంలో బస్సులో దాదాపు 30 మంది విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు. బుధవారం సాయంత్రం పాఠశాల విడిచిపెట్టిన తర్వాత పిల్లలను వారి వారి గ్రామాలకు తీసుకెళ్తుండగా ఈ సంఘటన జరిగినది. బస్సు దుగ్గిరాల నుండి మోరంపూడి వైపు వెళుతున్నది. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో బస్సు అదుపుతప్పి పక్కకు ఒరిగినట్లు డ్రైవర్ తెలిపాడు. రోడ్డుకు తూర్పు వైపున డెల్టా ప్రధాన కాలువ బకింగ్‌హామ్ కెనాల్ ఉండగా బస్సు పడమర వైపు మార్జిన్‌లో ఒరగడంతో ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

హోటల్లో గ్యాస్‌సిలిండర్ మంటలు

## ఎఎస్ఐ చొరవతో తప్పిన ముప్పు

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్

స్థానిక శివాలయం వీధిలో కొల్లిపర గురునాథంకు చెందిన హోటల్లో బుధవారం సాయంత్రం యజమాని గురునాథం గ్యాస్ పొయ్యి వెలిగించే క్రమంలో సిలిండర్ వద్ద మంటలు వచ్చాయి . అదే సమయంలో గస్తీ నిర్వహిస్తున్న ఏఎస్ఐ శ్రీనివాసరావు సాహసించి మంటల దగ్గరున్న గుర్నాథంను బయటికి తీసుకొచ్చారు. క్షణాల్లో ఆ వీధిలో జనాన్ని అటు ఇటు దూరంగా పంపించి వేశారు. చిలకలూరిపేట ఫైర్ స్టేషన్ వారికి గ్యాస్ ఏజెన్సీ వారికి సమాచారాన్ని అందజేశారు. ఈలోగా గ్యాస్ సిలిండర్ మంటలకు రెగ్యులేటర్ కరిగి గ్యాస్‌కు అడ్డం పడటంతో మంటలు ఆగిపోవడంతో అప్పటివరకు ఆందోళనలో ఉన్న ఏఎస్ఐ శ్రీనివాసరావు, ప్రజలు ఊపిరి తీసుకున్నారు.

## వాగులో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

పెదనందిపాడు నల్లమడవాగులో నాగులపాడు సమీపాన గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పెదనందిపాడు పోలీసులకు బుధవారం సమాచారం అందజేశారు. ఈ మేరకు పెదనందిపాడు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ ఏఎస్ఐ శ్రీనివాసరావు గుర్తు తెలియని మృతదేహాన్ని బయటికి తీయించారు. మతుడు గళ్ళ లుంగీ, బ్లూ షర్ట్ ధరించి ఉన్నాడని, కుడి చేతి పైన జి నరసమ్మ అని పచ్చ పొడిచి ఉన్నదని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

**పొలం పాస్‌పుస్తకం పోయినది**

దగ్గుల శ్రీకాంత్‌రెడ్డి అనే నేను మా అమ్మగారైన దగ్గుల రమణ భర్త : దగ్గుల వెంకటేశ్వరరెడ్డి గారి పొలం పాస్‌పుస్తకం ఖాతా నెం. 2215 ను నా ద్విచక్ర వాహనంలో పెట్టుకొని రామవరం జంక్షన్ వెళ్ళి, అక్కడ టిఫిన్‌చేసి వచ్చి చూడగా పాస్‌పుస్తకం కనపడలేదు. ఎవరికైనా దొరికిన యెడల ఈ నెంబర్‌కు **9989168896** ఫోన్ చేసి సమాచారం ఇవ్వవలసినదిగా కోరుతున్నాను.

# బిజెపి అవకాశవాదం వల్లే మణిపూర్‌లో మంటలు

## పలు పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - క్రోసూరు

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని, మహిళలపై దురాఘతానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ మండలం కేంద్రమైన క్రోసూరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాలు, అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ బిజెపి అవకాశవాదమే మణిపూర్ మంటలకు కారణమన్నారు. అల్లర్ల కారణంగా దాదాపు 60 వేల మంది కుకీలు నిరాశ్రయులయ్యారని, మహిళలపై వీడియో వైరల్ అయ్యే వరకూ ప్రధాని స్పందించలేదని మండిపడ్డారు. అడవుల్లోని ఖనిజ సంపదను కొల్లగొట్టి కార్పొరేట్లకు అప్పచెప్పే కుట్రలో భాగంగా అక్కడ అల్లర్లను ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. బిఎస్‌పి నియోజకవర్గ నాయకులు జి.శేఖర్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ గుజరాత్ సిఎంగా ఉన్నప్పుడు జరిగిన దాడుల తరహాలోనే ఇప్పుడు మణిపూర్‌లో జరుగుతున్నాయని చెప్పారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు దాసు మాట్లాడుతూ భారత రాజ్యాంగం భారతదేశంలోని ప్రజలందరికీ మత స్వేచ్ఛనిచ్చిందని, ఒకరిని ఒకరు చంపుకోవాలని ఏ మతమూ చెప్పదని అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సిహెచ్ ప్రభాకరరావు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలను కుల, మతాలకు అతీతంగా ప్రజలు ఖండించాలన్నారు. టిడిపి నాయకులు మల్లాల రామాంజనేయులు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు భారతదేశాన్ని అప్రతిష్టపాలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్ ఏషియా, టిడిపి నాయకులు డి.యోహాన, యు.రోశయ్య, మొగల్ జాన్, ఐద్వా నాయకులు టి.విజయ కుమారి, శుభ్రాభి, డి.స్వప్న, మాజీ ఎంపిటిసి కె.రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు మండల కార్యదర్శులు జి.చిన్నప్ప, మురళి, ఇశ్రాయేలు, సురేంద్ర, నాగమల్లి, డివైఎఫ్ఐ నాయకులు ఉదయ భాస్కర్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

నిరసనలో మాట్లాడుతున్న తిమ్మిశెట్టి హనుమతరావు

### ఇకెవైసి చేయించుకుంటేనే పిఎం కిసాన్ పథకం

## 1366 మందికి 30వ తేదీ వరకే గడువు

ప్రజాశక్తి-ఈపూరు

మండల వ్యవసాయ అధికారి రామారావు

ఇకెవైసి చేయించుకోని కారణంగా 1366 మంది రైతులు పిఎం కిసాన్ పథకాన్ని కోల్పోయే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు అన్నారు. వీరంతా ఈ నెల 30వ తేదీలోపు రైతు భరోసా కేంద్రం లేదా సిఎస్‌సి కేంద్రాల్లో ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. ఈ అంశంపై బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పిఎం కిసాన్ పథకానికి మండలంలో 8297 మంది రైతులు అర్హులని చెప్పారు. మండలంలో 2060 కౌలురైతు గుర్తింపు కార్డులు మంజూరు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 871 మందికి ఇచ్చామన్నారు. కార్డులు పొందినవారికి పంటల బీమా, రాయితీ విత్తనాలు, ఎరువులు, బ్యాంకు రుణాలు, పంట కొనుగోలు తదితర ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. రైతులు పొలం గట్లపై నాటుకునేందుకు కందులు అందుబాటులో ఉన్నాయని, మండలంలో 1095 ఎకరాల్లో కంది సాగు చేస్తుండగా దీన్ని 1750 ఎకరాలకు విస్తరించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కందులు క్వింటాళ్‌కు రూ.7 వేలు మద్దతు ధరను ప్రభుత్వం ఇస్తోందని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగలు ఖరీఫ్ సాగుకు అవసరమైన యూరియా, డిఎపి, 20-20 ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

## పెదకూరపాడు మండలంలో 1422 మంది

ప్రజాశక్తి - పెదకూరపాడు

పిఎం కిసాన్ నిధులు కోసం మండలంలోని రైతులందరూ ఇకెవైసి చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి శాంతి తెలిపారు. మండలంలో 1422 మంది రైతులు ఇకెవైసి చేయించుకోవాల్సి ఉందని, చేయించుకున్న రైతుల ఖాతాల్లోనే నిధులు జమవుతాయని చెప్పారు. రైతులు తమ గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రంలో గాని లేదా దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్లో గాని ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు.

## సేవలను పెంచడమే లక్ష్యంగా పని చేయండి

ప్రజాశక్తి-ఈపూరు

గ్రామ సచివాలయాలలో సేవా సర్వీసులు పెంచడమే లక్ష్యంగా సచివాలయ సిబ్బంది పని చేయాలని నరసరావుపేట డిఎల్‌డిఒ ఎం.వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని ఇనిమెళ్ల, ఈపూరు సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. సేవ సర్వీస్ నగదును ఎప్పటికప్పుడు ఖాతాలో జమ చేయాలని, రక్తహీనత ఉన్న పిల్లలను గుర్తించి పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయుష్మాన్ భారత్ నూరు శాతం పూర్తి చేయాలని, ఆయుష్మాన్ భారత్‌లో నమోదైన వారు దేశంలో ఏ ఆసుపత్రులోనైనా రూ.ఐదు లక్షల వరకు ఉచితంగా వైద్య సదుపాయం పొందొచ్చని తెలిపారు. పాఠశాలలను మహిళా సంరక్షణ కార్యదర్శి, ఎఎన్‌ఎంలు సందర్శించాలని, బాల్య వివాహాల వలన జరిగే నష్టాలను వివరించాలని చెప్పారు. ఆయన వెంట ఎంపిడిఒ రంగనాయకులు ఉన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్‌డిఒ ఎం.వెంకటరెడ్డి

గడియార స్తంభం వద్ద చెప్పులు కుట్టుకునే వారు

## బతుకుదెరువుపై వాననీళ్లు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రోజువారీ ఏదో ఒక పని చేసుకుంటేగాని ఇల్లు గడవని పేదలు వర్షాల నేపథ్యంలో ఉపాధికి దూరమయ్యారు. వారం రోజులుగా వర్షాల నేపథ్యంలో కూలీలు, వీధి విక్రేతలు, చిరు వ్యాపారులు, వివిధ వృత్తుల వారు పనులకు దూరమై ఆర్థిక ఇబ్బందులు ఏదుర్కొంటున్నారు. రోజంతా చిరు జల్లుల వల్ల ప్రజల ఇళ్ల నుండి బయటకు రావడానికే అవకాశం ఉండడం లేదు. దీంతో చిరు వ్యాపారులు, వీధి విక్రేతలకు బేరాలు తగ్గాయి. చెప్పులు కుట్టుకునే వారికి, వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులకు పనులే లేవు. రిక్షా, ఆటో కార్మికులకూ బాడుగల్లేవు. ఈ నేపథ్యంలో వీరికి జీవన భృతి కింద పది రోజులకు సరిపడ బియ్యం, నూనెలు, కూరగాయలు, ఇతర నిత్యావసరాలను ప్రభుత్వం పది రోజులపాటు ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు కోరారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ కె.పద్మావతి

## 34 మంది కుష్టు బాధితుల గుర్తింపు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఇటీవల చేపట్టిన సర్వేలో 34 మంది కుష్టు బాధితులను గుర్తించినట్లు పల్నాడు జిల్లా లెప్రసి టిబి - ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ కె.పద్మావతి తెలిపారు. వారిని వెంటనే పరిశీలించి ఉధృతి పెరగకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు తన కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. అనుమానితులను ఆరోగ్య శాఖ అధికారులు నిర్ధారించి నిర్దేశిత యాప్‌లో నమోదు చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రిజిస్టర్, రికార్డులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. కుష్టుపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. శరీరం మీద రంగు మారిన మచ్చలు, కళ్లు, కాళ్లు చేతుల్లో వైకల్యం ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చూపించాలన్నారు. మచ్చ రూపంలో ఉన్నప్పుడే వ్యాధిని నిర్ధారించి, చికిత్స తీసుకుంటే వ్యాధి పూర్తిగా నయమవుతుందని చెప్పారు. తరచు సర్వేలు చేసి కేసులను త్వరగా నిర్ధారిస్తే వైకల్యం రాకుండా కాపాడొచ్చని సిబ్బందికి సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా అనుమానితులను గుర్తించాలని చెప్పారు.

## విచారణలో నకిలీ మిర్చి విత్తన కేసు

ప్రజాశక్తి-ఈపూరు

నరసరావుపేట డీఎస్పీ కెవి మహేష్

నేరాల నియంత్రణకు అవసరమైన అన్ని రకాల చర్యలూ చేపడుతున్నట్లు నరసరావుపేట డీఎస్పీ కెవి మహేష్ అన్నారు. ఈపూరు పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సందర్శించిన డీఎస్పీ వీలేకర్లతో మాట్లాడారు. నకిలీ మిరప విత్తనాల కేసుకు సంబంధించి విచారణ జరుగుతోందన్నారు. మండలంలో రాత్రి వేళల్లో గస్తీ పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధాన కూడళ్లలో అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, గ్రామాలు, మండల కేంద్రాల్లో వ్యాపార, వాణిజ్య సముదాయాల వద్ద సీసీ కెమెరాలు అవసరమని చెప్పారు. డీఎస్పీ వెంట వినుకొండ రూరల్ సిఐయు సుధాకరరావు, ఎస్ఐ షేక్ మహమ్మద్ ఫిరోజ్ ఉన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ సమీర్‌బాష

## అమరవీరుల త్యాగం వృథా కాదు

ప్రజాశక్తి - రెంటచింతల

కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన అమరవీరుల త్యాగం వృథా కాదని ఎస్ఐ సమీర్‌బాష అన్నారు. కార్గిల్ దినస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఎన్.శ్రీనివాసరావు, ఎఎస్ఐ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాతులూరులో ప్రత్యేక పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - నాదెండ్ల

వర్షాకాలం నేపథ్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టినట్లు సాతులూరు సర్పంచ్ ఎం.శోభారాణి చెప్పారు. బుధవారం గ్రామంలో సైడు కాల్వల్లోని చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. పిచ్చిమొక్కలను తొలగిస్తున్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఈ పనులు చేయిస్తున్నామని సర్పంచ్ చెప్పారు.

# ఓటర్ల సర్వేలో పార్టీల ప్రతినిధులూ పాల్గొనవచ్చు

## - జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో జరుగుతున్న ఇంటింటికి ఓటరు కార్డు వెరిఫి కేషన్‌లో రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొని ఎన్నికల సంఘం నిర్దేశించిన మాం గ్దర్శకాల ప్రకారం పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించ టంలో అధికారులకు సహకారం అందించాలని జిల్లా ఎం.వేణుగోపాల్ రెడ్డి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డిఆర్ఒ కె.చంద్రశేఖరరావుతో కలసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆప్ నాయకులు సేవా కుమార్, బిఎస్‌పి నుండి సిహెచ్.వాసు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, కాంగ్రెస్ నాయకులు బి.సునీల్, టిడిపి నాయకులు కె.శివరామయ్య, వైసిపి నాయకులు ఎ.జోసెప్ కుమార్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ బిఎల్‌ఒలు ఇంటింటికీ వెళ్ళి ఓటరు కార్డులు వెరిఫికేషన్ చేస్తున్నారన్నారు. ఓటరు జాబితాలో డోర్ నెంబర్లు జీరో ఉండటం, ఒకే ఇంటి నెంబరుపై ఎక్కువ ఓటరు కార్డులు ఉన్న ఇళ్ళను పరిశీలించి, సంబంధిత ఓటర్లతో ప్రస్తుతం ఉన్న ఇంటినెంబరు మార్పుకోసం దరఖాస్తులు తీసుకోవటం జరుగుతుందన్నారు. అలాగే ఒకే ఇంటిలో ఉన్న వారందరినీ ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా వివరాలు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సేకరిస్తున్నట్లు చెప్పారు. బీఎల్‌ఓల తోపాటు రాజకీయపార్టీల బీఎల్‌ఏలను సమన్వం చేసుకుంటూ డోర్ టూ డోర్ వెరిఫికేషన్‌లో పాల్గొనేలా ఈఆర్వోలు, ఏఈఆర్వోలు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రాజకీయపార్టీల ప్రతినిధులు తెలిపిన పలు అంశాలపై అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. సమావేశంలో ఈఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లలితా, వెంకటశివరామిరెడ్డి, జిఎంసి అదనపు కమిషనర్ పెద్ది రోజ, ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ సర్వే పక్కగా చేపట్టాలి

### అదనపు కమిషనర్ పెద్ది రోజా

ప్రజాశక్తి-గుంటూరు :స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 ఓటర్ల జాబితాకి సంబంధించి డోర్ టు డోర్ సర్వేను బిఎల్‌ఓలు నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం అదనపు కమిషనర్ పెద్ది రోజా కొత్తపేట మెడికల్ కాంప్లెక్స్ ప్రాంతంలో జరుగుతున్న డోర్ టు డోర్ ఓటర్ సర్వేని ప్రత్యక్షంగా పరిశీలించారు.బిఎల్‌ఓలు ఓటర్

సర్వేలో సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కమిషనర్

సర్వే పక్కాగా చేపట్టాలని, ప్రధానంగా ఒకే డోర్ నంబర్‌లో ఎక్కువ ఓట్లు ఉన్న వాటిని, జీరో డోర్ నంబర్ ఉన్న వాటిని, జంక్ క్యారెక్టర్‌లు ఉన్నవాటిని ప్రత్యేకంగా పరిశీలన చేయాలన్నారు. 100 సంవత్సరాలు పైబడిన ఓటర్ల వయస్సు దవీకరణ పత్రాలను పరిశీలించాలన్నారు. బిఎల్‌ఓలతో పాటుగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజంట్లు కూడా సర్వేలో పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మణిపూర్ అల్లర్లకు బిజెపిదే బాధ్యత

ప్రజాశక్తి-తాడేపల్లి

మణిపూర్ మారణహోమం బిజెపి పుణ్యమేనని ఐద్వా నాయకులు కె.ఉషారాణి ఎద్దేవా చేశారు. రెండు జాతుల మధ్య వచ్చిన వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించకుండా ఒక వర్గాన్ని వెనకేసుకొని మణిపూర్ మారణహోమం సృష్టించారని విమర్శించారు. మణిపూర్ మారణహోమంపై వెంటనే చర్యలు తీసుకోవాలని, అక్కడ ఉన్న క్రైస్తవులకు భద్రత కల్పించాలని కోరుతూ బుధవారం తాడేపల్లి, మంగళగిరి కార్పొరేషన్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఉండవల్లి సెంటర్ నుంచి తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు, ఐద్వా నాయకులు మాట్లాడుతూ మానవత్వం మంటగలిసిన మణిపూర్ ఘటనపై పెదవి విప్పడానికి ప్రధాన మంత్రి మోడీకి 70 రోజులు పట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత గణతంత్ర, లౌకిక, ప్రజాస్వామ్య దేశంలో ఇంతవరకు జరగని విధంగా మహిళలను నగ్నంగా ఊరేగించి గ్యాంగ్ రేప్ చేసి చంపేయడం అత్యంత దుర్మార్గమన్నారు. అల్లరి మూకలను అదపు చేయడంలో అక్కడ ఉన్న ప్రభుత్వం విఫలమైందని

తాడేపల్లిలో నిరసన ర్యాలీ

వెంటనే మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మతోన్మాదం యొక్క వికృత రూపం ఎలాగ ఉంటుందో మణిపూర్ ఘటన తెలియజేస్తు ందన్నారు. మంగళగిరిలో బాప్టిజం ఘాట్‌ను పునర్నిర్మిం చాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ కార్యవర్గ సభ్యులు, అధ్యక్షులు ఎం.జాన్‌డెగ్లస్, ఎస్.జోసఫ్, సిహెచ్. డేవిడ్‌గాంధీ, బి.రవిప్రకాష్, సహదేవ్, కెకె రవికుమార్, రమేష్, కె.సుధాకర్, కె.ఐజయ్య, వృత్తికళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.జగన్, సిపిఎం నాయకులు కొట్టె కరుణాకరరావు, ఐద్వా నాయకులు పి.గిరిజ, పాల్గొన్నారు. అనంతరం తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

## డబుల్ ఇంజన్ సర్కారుదే బాధ్యత

### 'మణిపూర్ పరిణామాలు- వాస్తవాలు'పై సదస్సు లో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

మణిపూర్ పరిణామాలు- వాస్తవాలు అనే అంశంపై బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ అధ్యాపకులు సిఎస్ఆర్ ప్రసాద్, ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ మణిపూర్‌లో సామూహిక అత్యాచారాలు, మారణకాండకు కేంద్ర, రాష్ట్ర డబుల్ ఇంజన్ బిజెపి సర్కార్ బాధ్యత వహించాలన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయని, దీన్ని వెంటనే ఆపి అక్కడ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కుకీ తెగకు చెందిన ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి, సామూహిక లైంగిక దాడి చేసి హత్య చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నదన్నారు. దీన్ని ప్రజాస్వామ్య వాదులు అందరూ ఖండించాలని, అక్కడి ప్రజలకు అండగా నిలబడాలన్నారు.

మణిపూర్ జనాభాలో 54శాతం పైగా ఉన్న మైథీ తెగ కుకీ, నాగ గిరిజన తెగల మధ్య బిజెపి రాజకీయ లబ్ధి కోసం చిచ్చు పెట్టిందని విమర్శించారు. గిరిజన చట్టాలు గాలికి వదిలేసి మైథీలను గిరిజనులుగా మార్చడానికి, ఆదివాసీలను కొండ ప్రాంతం నుండి దూరం చేయాలని ప్రయత్నిస్తుందన్నారు. దీన్ని ప్రతి ఘటించిన కుకీ, నాగ తెగలపై మతోన్మాద శక్తులు బిజెపి అండతో తీవ్రమైన దాడులకు తెగబడుతున్నాయని అన్నారు.

మాట్లాడుతున్న సిఎస్ఆర్ ప్రసాద్

గహాలు, చర్చిలతోపాటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని తెలిపారు ఈ హింసాత్మక ఘటనలకు కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించి రాజీనామాలు చేయాలని, దోషులను వెంటనే శిక్షించాలని, బాధితులకు న్యాయం చేయాలని, అక్కడ శాంతియుత వాతావరణం నెలకొల్పాలని అన్నారు. ఈ స్టడీ సర్కిల్‌లో కె నళినీకాంత్, జి వెంకట్రావు, రామకష్ణ, వి.వి.కే సురేష్, సిహెచ్ కుమార్, ఎన్.వేణుగోపాలరావు, హనుమంతరావు, రాజేశ్వరరావు, నాగేశ్వరరావు, ఎస్ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగలకుదురు ఎంపీటీసీ రాజీనామా

ప్రజాశక్తి - తెనాలి: రూరల్ గ్రామం అంగలకుదురు2 ఎంపీటీసీ పేరం అరుణ పదవికి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. వైసీపీ తరపున ఆమె ఎంపీటీసీగా ఎన్నికల్లో గెలుపొందారు. అయితే గతంలో గ్రామంలో నెలకొన్న మట్టి వివాదానికి సంబంధించి ఆమె తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు హైమారావు గ్రామంలో మట్టిని అక్రమంగా తరలిస్తున్న నేపథ్యంలో దానిని ఆమె అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆమెపై హైమారావు విచక్షణ రహితంగా దాడి చేశారని, కులం పేరుతో దూషించారని, ఈ మేరకు ఆమె గత ఏడాది రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణలో తాత్సారం చేశారని, గ్రామ పార్టీ అధ్యక్షుడికి స్థానిక శాసనసభ్యుల అండ ఉందని ఆమె ఆరోపించారు. మనస్థాపానికి గురై ఎంపీటీసీ పదవికి, వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు ఎంపీపీకి లేఖ రాసినట్లు తెలిపారు.

పేరం అరుణ

## మహిళ, పిల్లల ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - తెనాలి

కుటుంబ కలహాల నేపథ్యంలో ఇల్లు విడిచి వెళ్లిన మహిళ, పిల్లల ఆచూకీ పోలీసులు కనుగొన్నారు. ఎస్సై సిహెచ్ వెంకటేశ్వర్లు బుధవారం వెల్లడించిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం కఠెవరంకు చెందిన బెజవాడ అనూష, ఆమె కుమారుడు బెజవాడ షణ్ముఖ సాయి (9), కుమార్తె వంశిక (3) తో కలిసి ఈ నెల 24న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయింది. భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణలో భాగంగా మనస్థాపానికి గురై వెళ్ళిపోయినట్లు ఆమె తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదయ్యింది. దర్యాప్తులో భాగంగా బుధవారం తల్లి, పిల్లలు విజయవాడలో ఉన్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని, కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరు కూడా తొందరపడి నిర్ణయాలు తీసుకోరాదని ,ఏదైనా సరే సమస్య ఉంటే కుటుంబ సభ్యులతో గాని, గ్రామ పెద్దలతోగాని, అవసరమైతే పోలీసువారి సహకారం కోరి సమస్యను పరిష్కరించుకోవాలని హితవు పలికారు.

శ్రీనివాసరావును సత్కరిస్తున్న యూనియన్ ప్రతినిధులు, అతిథులు

## శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని నియమించాలి

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్రంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోడౌన్ల సామర్థ్యానికి అనుగుణంగా శాశ్వత ప్రాతిపదికన సిబ్బంది నియామకం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎం శ్రీనివాసరావు అన్నారు. ఈనెల 23న ఆల్ ఇండియా వేర్ హౌసింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఫెడరేషన్ 7వ జాతీయ సమావేశం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరిగింది. అనిల్ బాజ్పేయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు పాల్గొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన గిడ్డంగుల సంస్థల యూనియన్ ప్రతినిధులు పాల్గొన్న సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, సంక్షేమం, గిడ్డంగులలో నిల్వలు, వ్యాపారాలకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర గిడ్డంగుల సంస్థలకు ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తుం దన్నారు. దానికి తగిన రీతిలో సిబ్బంది కూడా కష్టపడి పనిచేస్తున్నారని చెప్పారు. అయితే 1995 నుంచి సిబ్బంది నియామకం లేకపోవడంతో, సిబ్బంది కొరత ఏర్పడిందన్నారు. ఇది సంస్థ మనుగడకు ప్రమాదం అన్నారు. ఈ నేపథ్యంలో గిడ్డంగుల సామర్థ్యానికి అనుగుణంగా సిబ్బంది నియామకం చేపట్టాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. సమావేశంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రులు ఉమా శంకర్ గుప్తా, పిసి శర్మ పాల్గొని ప్రసంగించారని, సమావేశంలో అధికారులు ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నట్లు శ్రీనివాస రావు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును పలువురు సన్మానించారు.

# ఆ భూములను పేదలకు పంచేదాక పోరాటం

- పిల్ వేసిన వెంకటేశ్వర్లుకు భద్రత కల్పించాలి
- ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు తప్పుడు ప్రకటనలు చేస్తున్నారు
- రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు
- వివిధ పార్టీలు, సంఘాలు కలిసి జెఎసిగా ఏర్పాటు

ఐక్యతా అభివాదం చేస్తున్న నాయకులు

**ప్రజాశక్తి - వినుకొండ**

మండలంలోని బ్రాహ్మణపల్లి రెవెన్యూ పరిధి జాలలపాలెం వద్ద ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు పంచే వరకు పోరాడతామని వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ప్రకటించారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించగా టిడిపి జనసేన, బిఎస్పి, ఎంఐఎం, పిడిఎం, ఎంఆర్పిఎస్, మాల మహానాడు, సిపిఐ, ఏపీ గిరిజన సంఘం తదితర ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా సంఘాలు, పార్టీలు జెఎసిగా ఏర్పడ్డాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 175 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై హైకోర్టులో ప్రజావ్యాజ్యం వేసిన కె.వెంకటేశ్వర్లుకు భద్రత కల్పించాలని, దీనిపై ఐజికి విన్నవిస్తామని చెప్పారు. జాలలపాలెం భూ ఆక్రమణలపై జిల్లా అధికారులకు, ఎమ్మెల్యేకు హైకోర్టు నుండి నోటీసులు వస్తే ఎమ్మెల్యే తప్పుడు ప్రకటనలు చేయడం సరి కాదన్నారు. రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమి ఉన్నట్టుగా చూపుతున్న అధికారులు స్పందించడం లేదన్నారు. సమావేశంలో వివిధ సంఘాలు, పార్టీల నాయకులు ఎన్.రాజు, ఎన్.శ్రీనివాసరావు, పివి. సురేష్ బాబు, ఆర్కె.నాయుడు, బి.శ్రీను, ఆర్.ప్రసన్నకుమార్, చిదంబరం, కోటా నాయక్, పి.నాగమల్లేశ్వరరావు, మస్తాన్‌వలి, విజయ్, జి.ఏసురత్నం, జాన్‌పాల్ పాల్గొన్నారు.

డ్రెయినేజీని పరిశీలిస్తున్న చైర్మన్ రఫాని, కమిషనర్ గోవిందరావు

## డ్రెయినేజీ వ్యవస్థపై పరిశీలన

**ప్రజాశక్తి - చిలకలూరిపేట**

వర్షాల నేపథ్యంలో పట్టణంలో నీరు నిలుస్తున్న ప్రదేశాలను చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ సిహెచ్ గోవిందరావు బుధవారం పరిశీలించారు. ఎఎంజి పక్క నుండి వెళ్లే డ్రెయినేజీలో వ్యర్థాలు అడ్డుపడి నీరు రోడ్ల మీద నిలవడాన్ని గమనించి చర్యలకు సిబ్బందిని ఆదేశించారు. పరిశీలనలో వైస్ చైర్మన్ ఓలేటి వెంకటేశ్వర్లు, ఎఇ సిహెచ్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## రేపు పేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**ప్రజాశక్తి - చిలకలూరిపేట**

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో నిర్వహిస్తామని చైర్మన్ షేక్ రఫాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎజెండాలోని 22 అంశాలపై చర్చ ఉంటుందని, కౌన్సిలర్లు, అధికారులు సకాలంలో హాజరవ్వాలని కోరారు.

మాట్లాడుతున్న ఎంఇఒ-1 నాగరత్నం

## ఉపాధ్యాయులకు శిక్షణ

**ప్రజాశక్తి - యడ్లపాడు**

స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పలువురు ఉపాధ్యాయులకు మండలంలోని జగ్గాపురం జెడ్పి పాఠశాలలో బుధవారం శిక్షణిచ్చారు. ఈ సందర్భంగా ఎంఇఒ-1 నాగరత్నం మాట్లాడుతూ విద్యావిధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా బోధనా పద్ధతులను పాటించాలన్నారు. నాణ్యమైన విద్యను అందించాలని, నైతిక విలువలతో కూడిన బోధన చేయాలని చెప్పారు. జగ్గాపురం హైస్కూల్ హెచ్ఎం ఉషశ్రీ, సరిత పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - రెంటచింతల**

స్థానిక ఆంజనేయస్వామి మాన్యంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశ నిర్వహించారు. వివిధ అంశాలపై ఎంఇఒ-2 శివనాగేశ్వరరావు వివరించారు. డాక్టర్ చిన్నమ్మ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## పాఠశాలలకు ఐఎఫ్ పి ప్యానల్, స్మార్ట్ టీవీలు

**ప్రజాశక్తి - రెంటచింతల :** మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ఐఎఫ్ పి ప్యానల్, స్మార్ట్ టీవీలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎంఇఒ-2 శివ నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం 25 ప్యానల్, 3, 4, 5 తరగతులు విద్యార్థులకు 6 స్మార్ట్ టీవీలు వచ్చాయని తెలిపారు. వీటితో ఆన్లైన్ ద్వారా బైజుస్ కంటెంట్‌ను బోధిస్తామని చెప్పారు.

## ఉపాధ్యాయులకు జీతాలివ్వండి : యుటిఎఫ్

**ప్రజాశక్తి - రెంటచింతల**

ప్రమోషన్లు, బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు జీతాలు విడుదల చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్షులు జాన్ విజయ రాజ్‌కుమార్, గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎంబి చిన్నమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. గతనెల 14న 34 మంది టీచర్లు ఇతర ప్రాంతాల నుంచి వచ్చారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి జీతాలు విడుదల చేయాలని కోరారు.

## మునుగోడును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

రైతులకు స్ప్రేయర్లను అందిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

**ప్రజాశక్తి - అమరావతి**

మునుగోడు గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఎన్.శంకరరావు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంప్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారుల దృష్టికి 421 సమస్యలు రాగా వాటిని పరిష్కరించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో 90 శాతానికి పైగా రోడ్లు పూర్తి చేశామని, అమరావతి - బెల్లంకొండ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఆస్పత్రుల అభివృద్ధికి రూ.25 కోట్లకు పైగా ఖర్చు చేశామన్నారు. అనంతరం రూ.15 లక్షల వ్యవసాయ పని ముట్లను రైతులకు అందించారు. కార్యక్రమంలో క్రోసూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మాజీ చైర్మన్ వి.జ్వాల లక్ష్మీనరసింహారావు, ఎంపిపి ఎం.హనుమంతరావు, సచివాలయాల కన్వీనర్ ఎన్.రాంబాబు, సర్పంచ్ బి.విష్ణు, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - నాదెండ్ల**

మండలంలోని చందవరంలో జరిగిన కార్యక్రమంలో తహాశీల్దార్ ఎవి రమణ మాట్లాడుతూ 11 రకాల ధ్రువపత్రాలను జగనన్న సురక్ష క్యాంప్‌ల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి టి.రాణి, ఎంపిడిఒ షేక్ జాకీర్ హుస్సేన్, నాయకులు కె.మస్తాన్‌రావు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

చందవరం కార్యక్రమంలో నాయకులు, అధికారులు

## తప్పుడు కేసులకు భయపడేది లేదు : జీవీ ఆంజనేయులు

**ప్రజాశక్తి - వినుకొండ**

విలేకర్లతో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

ప్రభుత్వ భూమిలో మట్టి అక్రమ తరలింపుపై తాము వాస్తవాలను చూపినందుకు తనతోపాటు టిడిపి కార్యకర్తలపై ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తప్పుడు కేసులు పెట్టించారని టిడిపి జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు విమర్శించారు. ఇటువంటి కేసులకు బెదిరేది లేదని, తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వినుకొండ మండలం వెంకుపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 1 కొండ పోరంబోకు ప్రభుత్వ భూమిలో మట్టిని అక్రమంగా తరలించి ఎమ్మెల్యే తన ఆవుల ఫారాన్ని నింపుకుంటే టిడిపి ఆధ్వర్యంలో వాస్తవాలను ప్రజల ముందు ఉంచామని చెప్పారు. తాము ఆందోళన చేసిన ప్రదేశానికి తహాశీల్దార్ కిరణ్ కుమార్, ఇతర రెవెన్యూ అధికారులు వచ్చి వినతి పత్రాన్ని తీసుకున్నారని, బ్రహ్మనాయుడు ఆవుల ఫారం ప్రాంగణంలోకి వెళ్లకుండా రోడ్డు ప్రక్కన కంచ వెలుపను నుండి మట్టి కుప్పలను తాము చూపామని చెప్పారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తప్పుడు కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. నట్లు, బోల్టులు పోయాయని ఎమ్మెల్యే పెట్టించిన అభియోగం కేసును ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుకు తప్పుడు కేసులు పెట్టించడం అలవాటుగా మారిందని విమర్శించారు. ఎమ్మెల్యే సొంత గ్రామం వేల్పూరులో రైతు నరేంద్ర పంటకు మద్దతు ధర కల్పించాలని అడిగినందుకు హత్యాయత్నం కేసు పెట్టించారని దుయ్యబట్టారు. ఒక విలేకరిపైనా ఎస్టీ మహిళతో కేసు పెట్టించారని, సురేష్ మహల్ రోడ్డులో అక్రమంగా నిర్మాణాలను కూల్చివేస్తుంటే అడ్డుకున్న న్యాయవాది మూర్తిపై తప్పుడు కేసు పెట్టించారని అన్నారు. బొల్లా బ్రహ్మనాయుడు అవినీతిపై పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వ భూమిలో మట్టిని తరలించిన ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వి.పేరయ్య, పి.నాగేశ్వరరావు, గోవిందు నాయక్, జి.విశ్వనాథం, ఆర్.వీరంజనేయరెడ్డి, జి.హనుమంతరావు పాల్గొన్నారు.

కమిటీ సభ్యులకు కార్డులు ఇస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

## మంచిని పెంచి ప్రోత్సహించడమే మీడియా లక్ష్యం : కలెక్టర్

**ప్రజాశక్తి - పల్నాడు జిల్లా**

మంచిని పెంచి ప్రోత్సహించడమే మీడియా లక్ష్యమని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. మీడియా ప్రతినిధులకు సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డులను కలెక్టర్ తన కార్యాలయంలో బుధవారం అందించారు. సమాజ ప్రగతిలో మీడియా అమోఘమైన పాత్రను పోషిస్తుందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం ద్వారా పరిష్కారానికి కృషి చేస్తున్న మీడియా విధుల పట్ల అంకిత భావం, బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు - ప్రభుత్వ అధికారులకు మధ్య వారధిగా మీడియా ప్రతినిధులు పని చేయాలన్నారు. అర్హులంతా తమ కార్డులను నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్ వెనుక, ప్రకాష్ నగర్ ఒకటో లైన్, సమాచార పౌర సంబంధాల శాఖ జిల్లా కార్యాలయంలో తీసుకోవాలని సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి అల్లూరి సుభాష్ దీప్తి తెలిపారు.

## పాఠశాలకు కోతుల బెడద

**ప్రజాశక్తి - పల్నాడు జిల్లా**

రొంపిచర్ల మండలం చాకలికుంట తండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తరగతి గదుల్లోకి కోతులు వచ్చి భీభత్సం సష్టిస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. పాఠశాల లోపలకు వెళ్ళాలన్నా బయటకు రావాలన్నా, తరగతుల నిర్వహణకు కూడా ఇబ్బందిగా మారిందని అంటున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులైనా స్పందించాలని కోరుతున్నారు.

# ఇన్‌పుట్ సబ్సిడీపై జెడిని నిలదీసిన రైతులు

### త్వరలో రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్న వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు

### తెనాలి డివిజన్‌లో జెడి పర్యటన - ఆర్‌బికెల్లో పరిశీలన

రైతులతో మాట్లాడుతున్న డిడిఏ వెంకటేశ్వర్లు, ఏడిఏ ఉషారాణి

ప్రజాశక్తి-తెనాలి

గత ఏడాది రబీ నష్ట పరిహారం చెల్లించలేదని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నా పట్టించుకునే నాధుడే లేడని జిల్లా వ్యవసాయాధికారి ఎదుట రైతులు వాపోయారు. ఖరీఫ్ సీజన్ పరిస్థితులను పరిశీలించేం దుకు బుధవారం జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు తెనాలి వచ్చారు. తొలుత రూరల్ గ్రామం సంగంజాగర్లమూడిలో నిర్మాణంలో ఉన్న ఆర్బీకేను పరిశీలించారు. అనంతరం ఏడీఏ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏడీఏ కార్యాలయానికి చేరుకున్న రైతులు ఖరీఫ్ ప్రారంభంలోనే పొలాలు ముంపుకు గురై నష్టపోయామని, రబీలో జొన్న, మొక్కజొన్న పంట నష్టం అంచనాలు వేశారని, రైతుల ఖాతాలో నేటికీ జమకాలేదని, రెండేళ్ళక్రితం ఖరీఫ్‌లో ధాన్యం రవాణా ఖర్చులు కూడా చెల్లించలేదని జిల్లా వ్యవసాయాధికారి ముందు కౌలు రైతు మేకల చిట్టిబాబు, పలువురు రైతులు వాపోయారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు ఆందోళన పడాల్సిన పని లేదని, త్వరలో పెండింగ్ ఇన్‌పుట్ సబ్సిడీ వారి ఖాతాలకు జమౌతుందన్నారు. తెనాలి డివిజన్‌లో మొత్తం 60వేల ఎకరాల సాగుభూమి ఉందన్నారు. దానిలో ఖరీఫ్‌లో మూడు వేల ఎకరాల పైచిలుకు వెద పద్దతిలో నాట్లు వేశారన్నారు. వర్షాలు ఆగితే వెద పెట్టిన వరి పరిస్థితి తెలుస్తుందని, తదుపరి బిపిటి 5204 రకం ఆగస్టు రెండో వారం వరకూ వెద పెట్టుకో వచ్చున్నారు. ఆర్బీకేల ద్వారా భూసార పరీక్షలకు నమూనాలను పంపినట్లు తెలిపారు. వరి విత్తనాలు కేజికి రూ. 3 చొప్పున సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. ఖరీఫ్‌లో గ్రామీణ విత్తన పథకానికి కొన్ని గ్రామాలను ఎన్నుకుని విత్తన ఉత్పత్తికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పిఎం కిసాన్ ఈ కేవైసి చేయించుకోని రైతులు త్వరితగతిన చేయించుకోవాలన్నారు. విఆర్‌ఎ, విఎఎ ద్వారా కౌలు రైతు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకుని, సాధ్యమైనంత ఎక్కువ మంది కౌలు రైతులు లబ్ది పొందాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్.ఉషారాణి, మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులను తలపిస్తున్న పొలాలు

### కాలువల్లో గుర్రపుడెక్కను తక్షణం తొలగించాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - తెనాలి

ప్రభుత్వం పంట కాలువలు, మురుగు కాలువలు పట్టించుకోని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. భారీ వర్షాలకు పొలాలు ముంపునకు గురైన నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పొలాలు చెరువులను తలపిస్తున్నాయన్నారు. తెనాలి మండలంలో 17వేల ఎకరాలకు గాను రెండు వేల ఎకరాల్లో, కొల్లిపర మండలంలో 15500 ఎకరాలకు గాను 6500 ఎకరాల్లో వరి సాగైందన్నారు. ఈ నేపథ్యంల్లో పొలాల్లో చేరిన వర్షపు నీరు బయటకు పోవాలంటే ఇంకా పది రోజుల పట్టే పరిస్థితి నెలకొందన్నారు. ఎద పెట్టిన వరి దెబ్బతిని, రైతుల వద్ద విత్తనాలు లేక, నారు లేక ఆందోళనలో ఉన్నారన్నారు. ఏపి సీడ్స్ ద్వారా రైతులకు వరినారు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సాగునీటి, మురుగు కాలువల్లో గుర్రపుడెక్క, తూటాకు తొలగించాలని డిమాండ్ చేశారు.

## మమ్మల్ని విధుల్లోకి తీసుకోండి

ప్రజాశక్తి- మంగళగిరి

కోవిడ్-19 మూడు దశల సమయంలో మంగళగిరి ఆటో నగర్ లోని ఏపీఐఐసీ భవనంలో, గన్నవరం హెచ్ సి ఎల్ భవనంలో నిర్వహించిన 104 కోవిడ్ కాల్ సెంటర్లలో సుమారు 250 మందికి పైగా ఉద్యోగులు విధులు నిర్వహించారు. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పనిచేయడంతో ఫ్రంట్ లైన్ వర్కర్ల జాబితాలో చేరారు.కోవిడ్ కేసులు తగ్గడంతో క్రమంగా పలువురు సిబ్బంది ని విధుల నుండి తప్పిస్తూ వచ్చారు.104 కోవిడ్ కాల్ సెంటర్ ను మూసి వేసి మాతా శిశు మరణాల నివారణ కోసం ప్రత్యేకంగా మాతా,శిశు ఆరోగ్య 104 కాల్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. కోవిడ్ కాల్ సెంటర్ లో పని చేసిన సుమారు 56 మందిని మాతా శిశు కాల్ సెంటర్ లోకి తీసుకున్నారు.నిధుల కొరత సాకుగా చూపి వీరిలో 25 మందిని తప్పించారు.దీనితో తొలగించబడిన ఉద్యోగులు అసంతప్తి తో వున్నారు. కోవిడ్ వారియర్ సమయంలో తాము ప్రాణాలకు తెగించి విధుల్లో పాల్గొన్నామని, ఒకానొక సందర్భంలో ముఖ్యమంత్రి జగన్మోహనె ండ్డి తమ సేవలను ప్రశంసిస్తూ ఏ ఒక్కరినీ విధుల నుండి తొలగించ బోమని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.ఇప్పుడు అర్ధాంతరంగా తమ సేవలను గుర్తించకపోగా కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా నిధుల కొరతను సాకుగా చూపి తీసి వేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ప్రభుత్వం స్పందించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు సంబంధిత అధికారులను కోరు తున్నారు.

## విజ్ఞాన్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని యూఈఏసీ (యూనివర్సిటీ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీ కౌన్సిల్) ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీ దత్తగ్రామమైన శలపాడులో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఉచిత కంటి వైద్య శిబిరంతోపాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గుంటూరులోని డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి వైద్యుల బృందం ఆధ్వర్యంలో గ్రామస్తులకు కంటి పరీక్షలను నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు కంటి రుగ్మతలు, కంటి శుక్లాలను ముందస్తుగా గుర్తించడం ఎలా అనే అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి 250 మందికిపైగా హాజరవ్వగా, అందులో 110 మందికి అవసరమైన కళ్లజోళ్లు, మందులు అందించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామస్తులకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యం-పరిసరాల పరిశుభ్రత మీద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు, శలపాడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శిక్షణకు హాజరైన పాఠశాల ఉపాధ్యాయులు

## శిక్షణతో మెరుగైన విద్యాబోధన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఉపాధ్యాయుల కాంప్లెక్స్ ట్రైనింగ్స్ బోధన విధానాలను రెండవ రోజు నిర్వహించారు. బుధవారం మారీస్ పేట నల్లమోతు చెంచు రామానాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో పాఠశాల కాంప్లెక్స్ ఛైర్మెన్ ఎండి బషీర్ అహ్మద్ మాట్లాడారు. ప్రస్తుత సిలబస్ ప్రకారం తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఈవిఎస్ సబ్జెక్టులకు సంబంధించి టిఎల్‌ఎంలు తయారు చేసి ప్రదర్శించడం జరిగిందన్నారు. ప్రతినెలా జరగనున్న రెండు రోజుల కాంప్లెక్స్ ట్రైనింగ్స్‌ను సద్వినియోగపరచు కోవాలన్నారు. ఉపాధ్యాయులు మెరుగైన విద్యాబోధన పద్ధతులను అనుసరించాలని సూచించారు. శిక్షణా కార్యక్రమంలో క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ సిహెచ్ శ్రీదేవి చెంచుపేట కెఎస్ఎం కాంప్లెక్స్, మారిస్ పేట ఎన్సిఆర్ కాంప్లెక్స్, కొత్తపేట బాలుర ఉన్నతపాఠశాల కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కెఎల్‌యులో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు

ప్రజాశక్తి- తాడేపల్లిరూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను ఎన్‌సిసి 22ఆంధ్రా బెటాలియన్ అధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెనాలి ఎన్‌సిసి 22వ ఆంధ్రా బెటాలియన్ లెఫ్టినెంట్ వి.మౌనిక మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌పై భారతదేశం సాధించిన ఘన విజయానికి గుర్తుగా ప్రతి ఏడాది జూలై 26 న కార్గిల్ విజయ్ దివస్ జరుపుకుంటా మని అన్నారు. ఈ యుద్ధంలో దేశం కోసం అసువులు బాసిన ఎందరో అమర జవాన్ల త్యాగాలను స్మరించుకుని వారికి అంజలి ఘటిస్తామన్నారు. వీర జవాన్లకు గుర్తు చేసుకుంటూ ఎన్ సిసి క్యాడెట్లు గ్రీన్ ఫీల్డ్ క్యాంపస్‌లో కవాతు చేశారు. అమర జవాన్ల చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రొఫెసర్ వైస్ చాన్సలర్ డాక్టర ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విబాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, డీన్ సలహాదారులు డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, అడ్మిషన్ల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ షణ్ముఖ్, ఆచార్యులు డాక్టర్ శ్రీధర్, వి.మౌనిక, హాబీక్లబ్ ఇంచార్జి డాక్టర్ ఆర్.సుభాకర్ రాజు జవాన్లకు ఘననివాళులర్పించారు.

### చిర్రావూరు జడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు పలు పోటీలు

ఎం.టి.ఎం.సి పరిధిలోని చిర్రావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కె ఎల్ డీమ్డ్ యూనివర్సిటీ లోని సెంటర్ ఫర్ ఎక్స్ టెన్షన్ యాక్టివిటీస్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులతో పాటు సర్టిఫికెట్లలను అందజేశారు. కార్యక్రమంలో వర్శిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్. సిహెచ్. హనుమంతరావు, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె. రూత్ రమ్య , సీ.ఈ.ఏ ప్రొఫెసర్ ఇంచార్జ్ డాక్టర్. గోపికృష్ణ, సిఇఎ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ప్రగడ కోటయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి -మంగళగిరి

చేనేత ఉద్యమ నాయకులు ప్రగడ కోటయ్య 108వ జయంతిని పురస్కరించుకొని బుధవారం మంగళగిరి పట్టణ పద్మశాలి సంఘం కార్యాలయంలో ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, సంఘం అధ్యక్షులు సిహెచ్ కనకయ్య, కార్యదర్శి దామర్ల కుబేర స్వామి, సంఘం నాయకులు డాక్టర్ ఎం వెంకటేశ్వరావు, టీ కిరణ్, ఎస్ భూపతి, పి నాగేశ్వరావు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. వైసిపి కార్యాలయం జరిగిన కార్యక్రమంలో వైసీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, ఎమ్మెల్సీ మురుగుడా హనుమంతరావు, వైసిపి నాయకులు ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు.

## రత్నాల చెరువులో టిడిపి వితరణ

ప్రజాశక్తి - మంగళగిరి

:పట్నంలోని రత్నాల చెరువులో వర్షాల వలన ఇళ్లల్లోకి నీరు చేరిన బాధితులకు బుధవారం టిడిపి నాయకులు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పడవల మహేష్, సిలక వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇస్లామిక్ ఫ్రంట్ ఘనవిజయం

ప్రజాశక్తి -మంగళగిరి

మంగళగిరి అంజు మన్ ఎన్నికల్లో ఇస్లామిక్ ఫ్రంట్ ఘన విజ యం సాధిం చింది. ఈ నెల 23వ తేదీన సికె హైస్కూల్లో పోలింగ్ జరిగింది. 2875 ఓట్ల గాను 2751 ఓట్లు పోలయ్యాయి. లెక్కింపు మంగళవారం సాయంత్రం 6 గంటల నుండి ప్రారంభమైంది. నాలుగు పానెల్స్ పోటీలో ఉన్నాయి. 37 మంది రంగంలో ఉన్నారు. ఓట్ల లెక్కింపు బుధవారం తెల్లవారు జామున రెండు గంటల వరకు జరిగింది. ఇస్లామిక్ ఫ్రంట్ 9 డైరెక్టర్లు గాను ఏడు డైరెక్టర్లను గెలిచింది. ముస్లిం యువసేన రెండు డైరెక్టర్లు విజయం సాధించారని ఎన్నికల అధికారి అస్గర్ అలీ తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సి కె హై స్కూల్ ఆవరణలో డీఎస్పీ జే రాంబాబు ఆధ్వర్యంలో జరిగింది. ఇస్లామిక్ ఫ్రంట్ తరపున షేక్ అక్బర్ బాషా, షేక్ అబ్దుల్ అలీ, షేక్ అబ్దుల్ సలీం, షేక్ యాసిన్, షేక్ అలీ, షేక్ హనీఫ్ షా ఖదరి, షేక్ హాఫిజ్, ముస్లిం యువసేన తరపున షేక్ అక్రమ్, షేక్ అబుజలి ఎన్నికయ్యారు.

## చైల్డ్ హోమ్‌లో అన్నదానం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పట్టణంలోని కోసూరి కార్తీక్ జన్మదినం సందర్భంగావారి కుటుంబ సభ్యులు చైల్డ్‌హోమ్‌లో మన పొన్నూరు వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతు అవసరాల్లో ఉన్నవారికి సహాయం చేయటం ఆకలితో ఉన్నవారికి ఆకలి తీర్చటం తోటి వారికి సహాయం చేయండం గొప్ప విషయమన్నారు. కార్తీక్ తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో కార్తీక్ కుటుంబ సభ్యులు జాస్తి సుబ్బారావు, కోసూరి శైలజ, కామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

రత్నాల చెరువును చుట్టిముట్టిన వర్షపు నీరు

## చెరువులో ఉంటే నీళ్లు రాక ఏమి వస్తాయి..?

### అధికారుల తీరుకు ఆవేదన వ్యక్తం చేస్తున్న రత్నాలచెరువు వాసులు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణం లోని రత్నాల చెరువులో సూర్యనారాయణ నగర్, ఎస్టి కాలనీ ప్రాంతాల్లో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇళ్లల్లోకి నీరు చేరాయి. ఈ సందర్భం గా బుధవారం అధికారులు వచ్చి సహాయం చేయాల్సింది పోయి చెరువులో ఉంటే నీళ్ల రాక ఏమి వస్తాయని.. వ్యంగంగా మాట్లాడుతూ వెళ్లిపోయారని ఆ ప్రాంత ప్రజల వాపోతున్నారు. సుమారుగా 200 కుటుంబాల వారు ఆ ప్రాంతంలో నివసిస్తున్నారు. ఒకసారిగా నీరు రావడంతో ప్రజలు కట్టు బట్టలతో నిరాశ్రేయులుగా ఉండిపోయారు. అధికార యంత్రాంగం సహాయం చేయడానికి ముందుకు రావడం లేదని, వెంటనే స్పందించి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమతంగా ఉండాలి : కమిషనర్

ప్రజాశక్తి - మంగళగిరి

రానున్న రెండు మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా భారీవర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ముందస్తు సమాచారం అందించేందుకు గాను నగర పాలక సంస్థ నుండి ప్రత్యేక కాల్ సెంటర్ నెంబర్ - 7093912653 ఏర్పాటు చేసామని తద్వారా సత్వర పరిష్కార చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. ప్రజలు తమ పరిసరాలోల డ్రెయిన్‌లో చెత్తా, ప్లాస్టిక్ వేయరాదని కోరారు. ముసురు కారణంగా మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి వ్యాధులు తరుచుగా వస్తాయన్నారు. ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు బయట ఆహారాలకు దూరంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరు కాచి వడపోసిన నీరు తాగాలన్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని హెల్త్ సెంటర్లో సంప్రదించా లన్నారు. ముంపుకు గురయ్యే ప్రాంతాలోల విద్యుత్ వైర్లు తెగి పడే ప్రమాదం ఉన్నదని అటు వంటివి గుర్తించిన యెడల వెంటనే నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు సమాచారం అందిచాలని తెలిపారు. ముందస్తు సమాచారం అందిస్తే తప్పనిసరిగా పరిష్కార చర్యలు చేపడతామని కమిషనర్ పేర్కొన్నారు.

# నరక యాతన

తటాకాన్ని తలపిస్తున్న రాజీవ్ గృహకల్పకు వెళ్లే దారి

- తటాకాలను తలపిస్తున్న శివారు కాలనీలు
- రోడ్లపైన వర్షపు నీటితో ప్రజల ఇక్కట్లు
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ప్రమాదం

ప్రజాశక్తి-గుంటూరు

గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గుంటూరు శివారు కాలనీలు జలమయం అయ్యాయి. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్థవ్యవస్థంగా ఉండటంతో వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. ఇళ్లలో నుంచి కాళ్లు బయట పెట్టే పరిస్థితి లేదని ప్రజలు వాపోతున్నారు. గుంటల్లో నీరు నిలిచి ఎక్కడ కాలు వేస్తే ఏమౌతుందోనని భయపడుతున్నారు. వర్షపు నీరు నిలిచిపోవటంతో దోమలు పెరిగి, సీజనల్ వ్యాధుల ప్రభావం పొంచి ఉంది. మచ్చుకు కొన్ని కాలనీలను సందర్శించగా ఆయా పేటల్లో పరిస్థితి ఈ విధంగా ఉంది.స్వర్ణభారతి నగర్, సుందరయ్య నగర్, రాయపాటి శ్రీనివాస్ కాలనీ, సంగడిగుంట, పాతగుంటూరు తదితర శివారు ప్రాంతాలు వర్షపు నీటితో జలమయం అయ్యాయి. స్వర్ణభారతి నగర్‌లో సిమెంట్లు రోడ్లు ఉన్న చోట పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా రోడ్లు లేని లైన్లలో మోకాలు లోతున నీరు నిలిచిపోతుంది. కొన్ని లైన్లలో కాల్వలు కట్టి రోడ్లు వేయలేదు. కొన్ని లైన్లలో రోడ్లు వేసి కాల్వలు కట్టలేదు. ప్రధాన రహదారుల్లో వాహనాల్లోకి చెత్త ఎక్కించటానికి ఉపయోగిస్తున్న డస్ట్‌బిన్‌లకు చిల్లులు పడి ఉండటంతో సగం చెత్త అక్కడే కిందపడి వర్షానికి తడిచి, ఆప్రాంతంలో దుర్వాసన వస్తుంది. అలాగే పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో పది లైన్లకు గాను 3 లైన్లకు మాత్రమే సిమెంట్లు రోడ్లు మంజూరు కాగా ప్రస్తుతం వాటి నిర్మాణం జరుగుతుంది. 7 మిగిలిన ఏడు రోడ్లకు మంజూరు కాలేదు. దీంతో వర్షానికి బంకమట్టి కావటంతో గుంటలు పడి ప్రజలు నడవలేని స్థితిలో ఉన్నాయి. చిన్న పిల్లలు, ముసలి వారు రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారు. అలాగే రాయపాటి శ్రీనివాస్ కాలనీలోని రాజీవ్‌గృహ కల్పకు వెళ్లే ప్రధాన రహదారి తటాకాన్ని తలపిస్తుంది. సంగడిగుంట, పాతగుంటూరులోని సుద్దపల్లి డొంక, తదితర ప్రాంతాల్లో నీరు పెద్ద ఎత్తున నిలిచిపోయింది. అదే విధంగా ఖాళీ స్థలాల్లో మొక్కలు పెరిగి, పెద్ద ఎత్తున నీరు నిలిచి భయానకంగా ఉన్నాయి. ఖాళీల స్థలాల సమీపంలో నివశిస్తున్న ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని పలు పేటల్లోని ప్రజలు కోరుతున్నారు.

సంగడిగుంటలో రోడ్డుపై నిలిచిన నీరు

స్వర్ణభారతి నగర్‌లో నిలిచిన నీరు

### నిలిచిన నీటిని బయటకు పంపించాలి

**కె.నళినీకాంత్, సిపిఎం నగర కార్యదర్శి**

శివారు కాలనీలు, మురికి వాడల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచిపోయింది. డ్రైనేజీలు కూడా సరిగా లేకపోవటంతో నీరు పారట్లేదు. కావున అధికారులు స్పందించి నీటినీ బయటకు పంపించే ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదిన చేపట్టాలి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు పారిశుధ్య చర్యలు చేపట్టాలి.

### తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి

**- నాయుడు పద్మ, సుందరయ్య నగర్**

కాలనీలో మూడు రోడ్లు మంజూరు అయ్యాయి. కానీ మిగిలిన ఏడు రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. అడుగు బయట పెట్టలేకపోతున్నాము. మోకాలు లోతు బురద, నీరు ఉన్నాయి. మిగిలిన రోడ్లు తర్వాత మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. ఈలోగా వర్షాకాలంలో రోడ్లు ఉపయోగించే విధంగా తాత్కాలిక మరమ్మ తులు చేపట్టాలి.

## మంత్రులను కలిసిన సూపరింటెండెంట్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న మంత్రి మేరుగ

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ పరంగా తగిన సహకారం అందివ్వాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ గుంటూరులో రాష్ట్ర మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జునకు విజ్ఞప్తి చేశారు. డాక్టర్ కిరణ్‌కుమార్ సూపరింటెండెంట్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా మంత్రులను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం, రోగులకు సేవలు అందించే విషయం లో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని మంత్రులు సూచించారు. ఆసుపత్రిని ఒకసారి సందర్శించాల్సిందిగా మంత్రులను డాక్టర్ కిరణ్ కుమార్ కోరారు. ఆరోగ్య శ్రీ, ఆసరా పథకాలు ప్రతి ఒక్క పేద వారికి అందించే విధంగా కృషి చేయాలని వారు సూచించారు. ఆస్పత్రిని అభివృద్ధి చేసేందుకు గతనెల రోజులుగా సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ చేస్తున్న కృషిని మంత్రి నాగార్జున అభినందించారు. ఈమేరకు ఆయన్ను శాలువతో సత్కరించారు.

## వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

డ్రెయిన్ పరిశీలిస్తున్న కమిషనర్

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండా లని, పూడిక తీసిన అవుట్ ఫాల్‌డ్రైన్స్‌లో ఎక్కడైనా నీరు నిలిస్తే మరలా తీయించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం కమిషనర్ రామిరెడ్డితోట, కొత్తపేట, గుంటూరు వారి తోటలోని పలు ప్రాంతాల్లో అవుట్ ఫాల్‌డ్రైన్‌ని పరిశీలించి ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులకు తీసుకోవల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పూడికతీత పనులకు వర్షాకాలానికి ముందే అనుమతులు మంజూరు చేశామని, ఎక్కడైనా పూడికతీత పనులు పెండింగ్ ఉంటె యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. పూడిక తీసిన డ్రైన్లలో నీరు నిలిచినా, ఫిర్యాదులు వచ్చినా సదరు కాంట్రాక్టర్రే తిరిగి పూడిక తీయించాలన్నారు. మరో రెండ్రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు సంబంధిత సచివాలయం కార్యదర్శులతో తమకు కేటాయించిన ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను గుర్తించా లన్నారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో మోటార్ల ద్వారా బెయిల్ అవుట్ చేయాలని ఆదేశించారు. శిధిలావస్థ భవనాలలో నివాసం ఉండే వారికి వర్షాల వలన భవనాలు కూలి ప్రమాదాలు జరుగుతాయని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియచేయాలని సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. నగర ప్రజలు కూడా స్థానికంగా ఎక్కడైనా సమస్యలు ఎదురైతే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103 నంబర్ కి కాల్ చేయవచ్చని తెలిపారు.పర్యటనలో ఈ.ఈ. కోటేశ్వరరావు, డి.ఈ.ఈ. శ్రీనివాసరెడ్డి, ఏ.ఈ. సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కిట్స్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న చంద్రమౌళీశ్వరి

వింజనం పాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ జి.చంద్రమౌళేశ్వరి, పర్మినెంట్ లోక్‌అదాలత్ చైర్మన్ పి.వి.రాంబాబు, ప్యానల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు పాల్గొన్నారు. చంద్రమౌళేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు బావి భారత పౌరులని, కానీ కొందరు విద్యార్థులు అపరాధాలు చేసి వారి భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులకు లోక్ అదాలత్, భారతీయ చట్టాల గురించి వివరించారు. రాంబాబు మాట్లాడుతూ ఏఏ అపరాధాలు చేస్తే ఎలాంటి శిక్షలు ఉంటాయో వివరించారు. కట్టా కాళిదాసు మాట్లాడుతూ ర్యాగింగ్ వల్ల విద్యార్థులు వారి జీతాలు నాశనం చేసుకుంటూ తల్లిదండ్రుల ఆశలు అడియాశలు చేస్తున్నారన్నారు.చట్టంలో ర్యాగింగ్‌కు పాల్పడిన వారికి కఠినమైన శిక్షలు ఉన్నాయని చెప్పారు. అన్ని కాలేజిల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి, విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాలేజి చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రెటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ఎన్ఎస్ఎస్ విభాగం కె.చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 3న పేట ఏరియా వైద్యశాల ప్రారంభం

### మంత్రి విడదల రజని

ప్రజాశక్తి - చిలకలూరిపేట :ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సహకారంతో చిలకలూరిపేటలో అత్యాధునికంగా నిర్మించిన ఏరియా ఆస్పత్రి భవనాన్ని వచ్చే నెల మూడో తేదీన ప్రారంభించబోతున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని బుధవారం నాడు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేఖర్ల సమావేశలో మాట్లాడుతూ అదే రోజు రూ.9.5 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేయ బోతున్నామన్నారు. చిలకలూరిపేటలో కొత్తగా నిర్మించిన 100 పడకల ఏరియా ఆస్పత్రిని మంత్రి విడదల రజిని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. రూ.18.5 కోట్ల నిధులతో తమ ప్రభుత్వం చిలకలూరిపేటలో ఏరియా ఆస్పత్రిని నిర్మించిందని తెలిపారు. గత టిడిపి పాలకులు ఆసుపత్రిని పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. చిలకలూరిపేట పట్టణంలో లక్షన్నర మందికిపైగా జనాభా ఉన్నారని, పైగా జాతీయ రహదారికి ఆనుకుని ఆస్పత్రి ఉందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్పత్రి నిర్మాణాన్ని పరిశీలించామని, కేవలం పునాదుల వద్దనే ఆస్పత్రి నిర్మాణం ఆగిపోయి ఉందని తెలిపారు. భవనం బేస్‌మెంట్ లెవల్ పెంచడం, నూతన ఆస్పత్రి ప్రాంగణం చుట్టూ రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేయడం గురించి తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, ఆ మేరకు అనుమతులు వచ్చాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రివర్యులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిలకలూరిపేట ఆస్పత్రిని సీహెచ్‌సీ స్థాయి నుంచి ఏహెచ్ స్థాయికి పెంచారన్నారు. ఇప్పుడు జగనన్న రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసి, అత్యాధునిక పరికరాలను ఆస్పత్రిలో సమకూర్చామని పేర్కొన్నారు. సీఎస్ఆర్ నిధులతో మరిన్ని పరికరాలను ఆస్పత్రిలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటు న్నామని, గతంలో కేవలం15 మంది సిబ్బంది ఉంటే.. ఇప్పుడు ఏకంగా 96 పోస్టులు మంజూరు చేసి, నియామకాలు చేపట్టా మని పేర్కొన్నారు. ఇప్పుడు ఆస్పత్రిలో డాక్టర్లే ఏకంగా 23 మంది ఉన్నారని తెలిపారు. అత్యాధునిక వైద్య పరికరాలను ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చా మని తెలిపారు. తమ ప్రభుత్వం పలు అభివృద్ధిని చేతల్లో చేసి చూపించా మన్నారు. సంక్షేమ పథకాల ద్వారానే వెయ్యి కోట్లకు పైగా నగదును నేరుగా లబ్ధిదారులకి జమ చేశామని పేర్కొన్నారు.

చిలకలూరి ఏరియా ఆసుపత్రి వద్ద విడదల రజని